క్లుప్తంగా

ఆసుపత్రిలో విశ్రాంతి భవనానికి నిధులు


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సత్యనారాయణ, చైర్మన్ శ్రీనివాసరెడ్డి

గోపాలపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీపీ వుండవలి సత్యనారాయణ అన్నారు. గోపాలపురం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో రోగుల బంధువులు వేచి ఉండేందుకు విశ్రాంత భవనం, భోజనశాల నిర్మాణానికి మండల పరిషత్ నిధులను కేటాయిస్తున్నామన్నారు. కొంత కాలంగా ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది పనితీరు మెరుగు పడిందని చైర్మన్ శ్రీనివాస రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలాజీ అన్నారు. సమావేశంలో సీహెచ్‌సీ సూపరింటెంటెండ్ పి.శోభారాణి, ద్వారకాతిరుమల ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు తానింకి గంగరాజు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ల భార్యలకు దుస్తుల పంపిణీ


కృపావరంను సత్కరిస్తున్న పాస్టర్లు

గోపాలపురం: మండలంలోని పాస్టర్ల సమావేశం సోమవారం స్థానిక పెద్దగూడెం షాలేం ప్రార్థన మందిరంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాలపురం సొసైటీ అధ్యక్షుడు కూసం రామమోహన్‌రెడ్డి తన తండ్రి గాంధీ రెడ్డి జ్ఞాపకార్థం 70 మంది పాస్టర్ల సతీమణులకు దుస్తులు అందజేశారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ గోపాలపురం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఏబీసీ అధ్యక్షుడు పి.కృపావరం, దైవజనులు డి.జక్రయ్య, కొలూరి జోసెఫ్, తానేటి రాజు, జాన్‌పాల్‌లను పాస్టర్లు ఘనంగా సత్కరించారు.

బాలిక అదృశ్యంపై డీఎస్పీ విచారణ


విచారణ జరుపుతున్న కొవ్వూరు డీఎస్పీ వర్మ

గోపాలపురం: ఈ నెల 9న మండలంలోని వాదాలకుంట గ్రామంలో చోటుచేసుకున్న బాలిక అదృశ్యంపై గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కొవ్వూరు డీఎస్పీ వీవీఎస్ వర్మ సోమవారం వాదాలకుంట గ్రామం వచ్చి, ఆ బాలిక అదృశ్యంపై విచారణ జరిపారు. అదృశ్యమైన బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టామని, రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని డీఎస్పీ వర్మ చెప్పారు. ఆయన వెంట గోపాలపురం ఎస్ఐ కొరివి రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

తాళ్లపూడిలో గజ్జె పూజ


తాళ్లపూడి గజ్జె పూజలో కోలాటం చేస్తున్న బాలికలు

తాళ్లపూడి: కోలాటం బృందాలను తయారు చేయడం ద్వారా హిందూ మత వ్యాప్తికి, హిందూ మత వ్యాప్తికి కృషి చేస్తున్నట్టు కోలాటం గురువు చల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. తాళ్లపూడిలోని సాయిబాబా ఆలయం వద్ద సోమవారం గజ్జె పూజ మహోత్సవం నిర్వహించారు. ఇప్పటి వరకూ తాను 50 వరకూ కోలాటం బృందాలను తయారు చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల షిర్డీసాయి కోలాటం బందాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా గజ్జె పూజ నిర్వహించాక, బాలికలు కోలాటాన్ని ప్రదర్శించారు.

'స్పందన'కు ఐదు అర్జీలు

ఉండ్రాజవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, తహసీల్దార్ జి.కనకరాజు తెలిపారు. కాల్దారి గ్రామం నుంచి మూడు, తాడిపర్రు, పాలంగి గ్రామాల నుంచి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చినట్టు వారు వివరించారు. ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతపై గురి

- టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు


నిడదవోలు జెడ్పీ బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్న అదనపు తరగతి

నిడదవోలు: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. టెన్త్ పరీక్షల్లో సాధించే మార్కులే ఏ విద్యార్థి ఉన్నత విద్యకైనా తొలి మెట్టు. దీనిని దృష్టిలో పెట్టుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్టడీ అవర్స్ ఏర్పాటు టెన్త్ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాయి. ఏప్రిల్ 3 నుంచి 18 వరకూ టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో 11 ఉండే ప్రశ్నాపత్రాలను ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లకు కుదించారు. పరీక్ష కాల వ్యవధి 3.15 గంటలు కాగా, ఒక్కో పేపర్ వంద మార్కులకు ఉంటుంది. పబ్లిక్ పరీక్షలకు సన్నాహంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా ప్రభావం వల్ల గతేడాది టెన్త్ ఫలితాలు అంతంత మాత్రంగా వచ్చాయి. ఈ ఏడాది పాఠశాలలను ఆలస్యంగా తెరిచినా విద్యా సంవత్సరం సక్రమంగానే సాగింది. నిడదవోలు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది 2,942 మంది టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా మంచి మార్కులు సాధించేలా ముందుగా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతేడాది డిసెంబర్ నెలాఖరు నాటికే అన్ని సబ్జెక్ట్‌ల బోధనను ఉపాధ్యాయులు పూర్తి చేశారు. జనవరి నుంచి రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున రివిజన్ టెస్టులను పూర్తి చేశారు. ప్రతి సబ్జెక్టు నుంచి రోజుకు ఒక పాఠ్యాంశాన్ని రివిజన్ చేయించడం ద్వారా మొత్తం సిలబస్ పునశ్చరణ జరుగుతోంది.

నియోజకవర్గంలో టెన్త్ విద్యార్థుల వివరాలు

మండలం	హైస్కూళ్లు	విద్యార్థులు
నిడదవోలు పట్టణం, మండలం	20	1,278
ఉండ్రాజవరం	11	917
పెరవలి	12	747

ప్రత్యేక తరగతులతో మేలు


ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు ఎంతో మేలు జరుగుతోంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను. ఇంగ్లిష్, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులను శ్రద్ధగా బోధిస్తున్నారు.
–యర్రంశెట్టి భవాని, విద్యార్థిని, మున్సిపల్ హైస్కూల్ నంబర్–3, నిడదవోలు

రోజూ రివిజన్ టెస్టులు రాస్తున్నాం


ప్రత్యేక తరగతుల్లో రివిజన్ టెస్టులు పెడుతున్నారు. మరుసటి రోజు రివిజన్ టెస్టుల్లో ఉన్న తప్పులను మా చేత సరి చేయించడం పబ్లిక్ పరీక్షల్లో సకాలంలో సమగ్రంగా పేపర్ రాయడానికి సహాయ పడుతుంది. లెక్కలు, సైన్స్ సబ్జెక్టులను బాగా చదువుతున్నాను.
–కె.అలివేలు, విద్యార్థిని, జెడ్పీ హైస్కూల్, నిడదవోలు

ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం


జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీఎంవోలతో కలసి టెన్త్ స్కూళ్లలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. డీసీఈబీ ఇచ్చిన 60 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాం. టెన్త్ విద్యార్థులను ఏ బి సి డి గ్రూపులుగా విభజించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.
–కిషోర్‌కుమార్, ఎంఈవో, నిడదవోలు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేస్తారు. సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా పొందాలో ప్రత్యేక తరగతుల్లో బోధిస్తున్నాం.
–సత్తి శ్రీరామరెడ్డి, హెచ్ఎం, మున్సిపల్ హైస్కూల్ నంబర్– 3, నిడదవోలు

గణితం అంటే భయం పోగొడుతున్నాం


కొందరు విద్యార్థులకు లెక్కల సబ్జెక్టు అంటే భయం. వారిలో ఆ భయాన్ని తొలగించి, దృష్టి పెడితో లెక్కలు సులువైన సబ్జెక్టు అనేలా విద్యార్థులను మోటివేట్ చేస్తున్నాం. సమయాన్ని, కచ్చితత్వాన్ని సరిచూసుకుంటూ పరీక్ష రాయాలి.
–అప్పారావు, లెక్కల టీచర్, ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్, నిడదవోలు

వేగేశ్వరపురంలో వీరన్నబాబు సంబరం


గోదావరి తీరంలో విభూతి పండ్లకు పూజలు చేస్తున్న వేగేశ్వరపురం మహిళలు

తాళ్లపూడి: వీరన్నబాబు సంబరాన్ని సోమవారం వేగేశ్వరపురం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామ మహిళలు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి విభూది పండ్లకు పూజలు చేశారు.అనంతరం మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలతో వారు గ్రామోత్సవం నిర్వహించారు. విభూది పండ్లను వీరులుగా భావించి పూజలు చేయడం ఈ గ్రామంలో ఆనవాయితీ. అనంతరం విభూది పండ్లను తలపై పెట్టుకుని వీరన్నబాబు గద్దెలో ప్రతిష్ఠించారు. వీరభద్రుని వేషధారులు శూలాలతో నృత్యాలు చేశారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆటకట్టుకున్నాయి. రాత్రంతా వీరన్నబాబు సేవ నిర్వహించారు. వేగేశ్వరపురంలోని గద్దెకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, 17 ఏళ్లుగా ఏటా మాఘ మాసంలో వీరన్నబాబు సంబరాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మెరిట్ విద్యార్థినికి 'మానవత 'ఆర్థిక సాయం


విద్యార్థిని చదువు నిమిత్తం తండ్రికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: పదో తరగతి పరీక్షల్లో 580 మార్కులు సాధించి, ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన కాసే హర్షిణి అనే విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ రూ.15 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించింది. తాళ్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆ విద్యార్థిని తండ్రికి సోమవారం ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే దుగ్గిరాల సూర్యనారాయణ రూ.10 వేల విలువైన సెల్ ఫోన్‌ను హర్షిణికి బహూకరించారు. కాగా హర్షిణి తండ్రి రామ్‌ప్రసాద్ తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. మానవత సంస్థ సభ్యులు సనపల రాజశేఖర్, బి. శంకర్,చెరుకూరి బంగారు బాబు, సీహెచ్ ఆంజనేయులు, రాజశేఖర్, శంకర్, గుప్త సాయన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో డ్రోన్ సాయంతో భూముల రీ సర్వే

నల్లజర్ల: భూముల రీ సర్వేతో భూ యజమానులకు మేలు జరుగుతుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వర్ధనపు కిశోర్‌కుమార్ అన్నారు. అనంతపల్లి శివారు సంజీవపురం, వీరవల్లి గ్రామాల్లో డ్రోన్ సహాయంతో భూ సర్వేను సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో 14 రెవెన్యూ గ్రామా ల పరిధిలోని 60, 502 ఎకరాల్లో ఫీల్డ్ సర్వే పూర్తయ్యాక డ్రోన్ సర్వే ప్రారంభమైందన్నారు. వీఆర్వోలు ఈ.రామారావు, శ్రీనివాస్, పీవీ రాజు, సచివాలయ కార్యదర్శి దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా బ్రాహ్మణగూడెం, దారవరం గ్రామాల్లో సోమవారం డ్రోన్ సాయంతో భూ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తహసీల్దార్ కె.నిరంజన్ నమాట్లాడుతూ భూ సర్వేకు రైతులు, భూ యజమనులు సహకరించి సరిహద్దులను చూసుకోవాలని కోరారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సర్వేను చేస్తున్నారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్, మండల సర్వేయర్ వంశీకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భక్తి గీతాల ఆడియో విడుదల

కొవ్వూరు: పట్టణానికి చెందిన సినీ గేయరచయిత మనాశ్రీ రచించిన ఆరు భక్తి గీతాల ఆడియోను సోమవారం స్థానిక గోష్పాద క్షేత్రంలోని నరసింహస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్, వేద పరిషత్ అధ్యక్షుడు ధూళిపాళ సూర్యనారాయణ శాస్త్రి, డాక్టర్ కామేశ్వరశర్మ, యువరాజ్ కేబుల్ అధినేత దుద్దుపూడి రామచంద్రరావు, భక్తి బాంధవ కేశవ మహరాజ్ చేతుల మీదుగా భక్తి గీతాలను ఆవిష్కరించారు. రచయిత మనాశ్రీని ఘనంగా సత్కరించారు.

రావిమెట్లలో 165 మందికి నేత్ర పరీక్షలు


రావిమెట్ల కంటి వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ సభ్యులు, దాతలు

నిడదవోలు రూరల్: దాతల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఎంఈఓ, రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ గాలి రాఘవయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని రావిమెట్ల గ్రామంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇంజే గోపాలం 17వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం సిబ్బంది 165 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 96 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 26 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాచర్ల మధుసూధనరావు, సభ్యులు ఇంజే శేఖర్, ఝాన్సీ, కుటుంబరావు, ఇంజే పాల్, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎం.వెంకట్రావు, ఫణిసింహ, శ్రీధర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

ఇద్దరికి తీవ్ర, 10 మందికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రావెల్స్ బస్సు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం బందపురం వద్ద సోమవారం తెల్లవారు జామున ప్రమాదం చోటుచేసుకుంది. కొవ్వూరు వైపు నుంచి గుండుగొలను వైపు 41 మంది ప్రయాణికులతో వెళుతున్న సుధశ్రీ ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు అయినప్పటికీ ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. లారీ డ్రైవర్‌కు, బస్సులోని ఓ ప్రయాణికురాలికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108తో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ను వాహనాలు ఏర్పాటు చేసి మిగిలిన ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు పంపించినట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ట్రావెల్స్ బస్సులో మంగళగిరి నుంచి వివాహ వేడుకకు మోజర్లై, తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు ఆయన తెలిపారు.

వాహనాల వేలం ద్వారా రూ.6.70 లక్షల ఆదాయం

కొవ్వూరు: వివిధ సారా కేసుల్లో పట్టుబడిన 35 వాహనాలకు పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ వద్ద సోమవారం వేలం నిర్వహించగా రూ.6.70 లక్షల ఆదాయం సమకూరిందని స్థానిక ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఎస్ఈబీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మార్గాని రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించామన్నారు. ఒక ఆటో, ఒక కారు, ఒక టాటా ఏసీ వ్యాన్, 32 ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్టు వివరించారు. ప్రభుత్వం వీటి విలువను రూ.2,43,400 గా నిర్ధారించగా, అంతకంటే రూ.4,26,600 అదనంగా ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి

గోపాలపురం: బైక్‌పై వెళుతూ కింద పడి గాయపడిన మండలంలోని చిట్యాల గ్రామస్తుడు అప్పకొండ భాస్కరరావు (64) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో చెందాడు. గోపాలపురం ఎస్ఐ కొరివి రామకృష్ణ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భాస్కరరావు ఈనెల 5న గోపాలపురం నుంచి తిరిగి చిట్యాల వెళుతూ చిట్యాల సాయిబాబా ఆలయం వద్ద బైక్‌పై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధ రాత్రి మృతి చెందాడు.

బంకుల్లో తనిఖీలు ప్రారంభం

నల్లజర్ల: పెట్రోల్ బంకుల్లో నిబంధనలు ఎంత వరకూ అమలవుతున్నాయో తెలుసు కునేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం నుంచి తనిఖీలు చేపట్టారు. తమ పరిధిలోని 164 బంకులను తనిఖీ చేయనున్నట్టు అసిస్టెంట్ సివిల్ సప్లయి ఆఫీసర్ విజయభాస్కర్, సీఎస్ డీటీ సునీత సోమవారం నల్లజర్లలో విలేకరులకు తెలిపారు. వినియోగదారులకు తాగునీరు, టాయిలెట్లు, వాహనాలకు గాలి వంటి వాటిని ఉచితంగా అందిస్తున్నారా లేదా తెలుసుకుంటామన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్‌లో కల్తీ ఏమైనా జరిగిందా? రికార్డులు సక్రమంగా అన్నాయా? అనే విషయాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.


పీహెచ్‌సీని సందర్శించిన ఎన్నారై వైద్యురాలు

ఐసీయూ బెడ్స్ బహూకరణ


గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎన్నారై వైద్యురాలు సురేఖ

దేవరపల్లి: డాక్టర్ ముళ్లపూడి వెంకట్రావు మెమోరియల్ ట్రస్ట్ (హైదరాబాద్) నిర్వాహకురాలు, అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యురాలు ఎం.సురేఖ సోమవారం మండలంలోని గౌరీపట్నం పీహెచ్‌సీని సందర్శించారు. డాక్టర్ సురేఖ తండ్రి అయిన డాక్టర్ ముళ్లపూడి వెంకట్రావు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి లోగడ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన స్వగ్రామం గౌరీపట్నం. సుమారు 40 ఏళ్ల క్రితం డాక్టర్ వెంకట్రావు తన స్వగ్రామంలో ప్రభుత్వాసుపత్రిని స్థాపించారు. అప్పట్లోనే ఎంతో మంది పేదలకు ఇక్కడ మెరుగైన వైద్యం అందించేవారు. ఈ నేపథ్యంలో తన తండ్రి స్థాపించిన ఆసుపత్రిని సోమవారం సందర్శించిన డాక్టర్ సురేఖ ఈ పీహెచ్‌సీలోని సమస్యలను వైద్యాధికారులైన టి.సూర్యకళ, బి.మౌనికలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి రెండు ఐసీయూ బెడ్స్, ఫీటల్ డూప్లర్, బేబీ వార్మర్‌ను బహుమతిగా అందించారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఆసుపత్రికి అవసరమైన పరికరాలను అందజేస్తానని డాక్టర్ సురేఖ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సత్యనారాయణ, ఎల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌వీవీ రమణ, సీహెచ్‌ఓ శ్రీకృష్ణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి రామలింగేశ్వర కల్యాణోత్సవాలు


పాలంగి రామలింగేశ్వరస్వామి ఆలయం

ఉండ్రాజవరం: పాంచాహ్నిక కల్యాణ మహోత్సవాలకు పాలంగిలోని బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయం ముస్తాబవుతోంది. ఆలయాన్ని, పరిసరాలను దేవస్థానం సిబ్బంది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 16 నుంచి 20 వరకూ ఉత్సవాలు జరుగుతాయి.16 ఉదయం రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. అదే రోజు స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేస్తారు. 17 సాయత్రం బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారికి, రామలింగేశ్వరస్వామి వారికి కల్యాణం, రాత్రి 9 గంటలకు స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. 18న మహాశివరాత్రి నాడు భారీ అన్న సమారాధన జరుగుతుంది. 20న రుద్రాభిషేకం, త్రిశూలస్నానం, పూర్ణాహుతి సాయంత్ర స్వామివారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహిస్తారు. ఆలయ చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, కార్యనిర్వహణాధికారి వైవీ రామయ్య పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మాస్టారి వర్ధంతి నాడు సేవా కార్యక్రమాలు

నల్లజర్ల: చిన్నప్పుడు తనకు విద్యాబుద్ధులు నేర్పిన మాస్టారి వర్ధంతిని పేదల మధ్య జరుపుకున్నాడో అసిస్టెంట్ ప్రొఫెసర్. ఆయనే నల్లజర్ల మండలంలోని చీపురుగూడేనికి చెందిన వసంతాడ ఆనంద్ స్వరూప్. తనకు చదువు చెప్పిన సూరయ్య మాస్టారి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆనంద్ స్వరూప్ తన కుటుంబ సభ్యులతో కలసి నల్లజర్ల పోలీస్ స్టేషన్ వెనుక ప్రాంతంలో చిత్తు కాగితాలు ఏరుకునే వారికి వస్త్ర, అన్నదానాలు చేశారు. బస్‌షెల్టర్లలోని యాచకులకు ఆహారం పొట్లాలు అందించారు. దేవరపల్లి మండలంలోని గొల్లగూడెం, కృష్ణంపాలెంలలోని వికలాంగుల, వృద్ధుల ఆశ్రమాలకు అన్నదానంతో పాటు ఆర్థిక సాయం కూడా చేశారు.

అశ్రునివాళి



శ్రీమతి గంధం మణి గారు
జననం: 01-07-1955 మరణం: 03-02-2023
ప్రేమానురాగాలకు మారుపేరుగా నిలిచి, ఎల్లప్పుడూ మా ఉన్నతిని కాంక్షించి,
మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మీ మరణం మాకు ఎన్నటికి తీరనిలోటు.
భౌతికంగా మాకు దూరమైన మీ మధుర స్మృతులు మా హృదయాలలో సజీవంగానే ఉంటాయి.
భర్త: గంధం కృష్ణమూర్తి Rtd.APSRTC
కుమారుడు - కోడలు: గంధం వెంకటేశ్వరరావు - శాంతి
మనుమలు: భవాని భాస్కర్, పూర్ణసాయి
గంధం దుర్గ శివకుమార్ - ఉదయ శ్రీ
కుమార్తె - అల్లుడు: ఆదిమూలం పద్మావతి - నాగేశ్వరరావు
మనుమలు: మధు కిరణ్, రామ్ గాయత్రి కుమారి
పెదకార్యం : 15-02-2023 బుధవారం నిడదవోలు బసివిరెడ్డిపేట లోని మా స్వగృహం నందు జరుపబడును.